క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం, పాగుంట, నందిన్నె, కేటీదొడ్డి, మైలగడ్డస్టేజ్ గ్రామాల్లో ఎరువులు, మందుల దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయాధికారి సాజిద్ రెహ్మాన్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు పురుగు మందులు సరసమైన ధరలకు ఇవ్వాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతులకు తక్షణమే బిల్లులు ఇవ్వాలని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో రేణుక ఎల్లమ్మ ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి కొత్తకోట గ్రామం నుంచి ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో వెళ్లారు. మంగళవారం కంచుపాడు గ్రామానికి చెందిన వెంకటరాముడు బైక్‌పై అతివేగంగా వెళ్తూ విఘ్నేష్ (6)ఢీ కొట్టడంతో కుడి కాలుకు రక్త గాయమైంది. బాలుడి మామ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదుతో వెంకటరాముడుపై ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

ఆత్మకూర్: మండలంలోని పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి విడుదల చేశారు. ఆత్మకూర్ మండలంలో మొత్తం 114 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటికి సంబంధించిన అభ్యంతరాలు ఇది వరకే స్వీకరించినట్లు తెలిపారు.

కొత్తకోట రూరల్: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో గల వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల బాబితాను మంగళవారం ఎంపీడీఓ చెన్నమ్మ, ఎంపీఓ సుదర్శన్ విడుదల చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నోటీస్ బోర్డుపై పొందుపర్చారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

అమరచింత: పట్టణంలోని రాంనగర్ కాలనీలో మంగళవారం బీజేపీ బూత్ కమిటీని ఎన్నుకున్నామని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు తెలిపారు. బూత్ అధ్యక్షుడిగా కుమార్, కార్యదర్శిగా శ్రీకాంత్, సభ్యులుగా దేవర్ల రవి, హమాలి వెంకటేష్, పాండు ను నియమించారు.

రిలే నిరాహార దీక్షలు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ పంచాయతీ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు మంగళవారం కొనసాగింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లుతో పాటు రేషన్‌కార్డులు, పింఛన్ మంజూరు చేయాలని ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ పెద్ద ఖాజా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వాటిని తక్షణమే అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం మరో రూ.5 లక్షలు మంజూరు చేస్తే పేదలకు సొంతింటి కల నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రవిప్రసాద్, మాజీ సర్పంచ్ కాంతమ్మ, ప్రజా నాట్య మండలి నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

మక్తల్: పట్టణంలోని శ్రీపడమటి ఆంజనేయ స్వామి ఉత్సవాల సందర్భంగా మంగళవారం రిటైర్డ్ ఉద్యోగి లక్ష్మణ్ జ్ఞాపకార్థకంగా సాయిగణేష్ ఆధ్వర్యంలో సండెపురాళ్ల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి 116 కేజీలు బరువును ఎత్తిన బాల్లూర్‌కు చెందిన సూరికి 8తులాల వెండి, రెండో బహుమతి కింద 111 కేజీలు ఎత్తిన కున్సి గ్రామానికి చెందిన నర్సింహకు 5తులాల వెండి, మూడో బహుమతి 105 కేజీల ఎత్తిన పంచదేవ్‌పాడుకు చెందిన నాగేష్‌కు మూడు తులాల వెండిని అందజేశారు. అనంతరం పోటీలో గెలుపొందిన వారికి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రణేష్‌కుమార్, ఈఓ శ్యాంసుందర్, అరవిందు పాల్గొన్నారు.

పాఠశాలలకు రక్షణ ఏదీ?

- ప్రహరీ లేక విద్యార్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రహరీ లేని నాగర్‌దొడ్డి పాఠశాల

మల్దకల్: ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు లక్షలు వెచ్చించి పాఠశాలలను నిర్మిస్తున్నా, ఆ పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో వాటి ఆవరణలో పశువులు, పందులు సంచరిస్తూ ఉపాధ్యాయులను, విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి మల్దకల్, గట్టు, కేటీదొడ్డి, ధరూరు, గద్వాల మండలాల్లో కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేవు. మల్దకల్ మండలంలో మొత్తం 10 జెడ్పీహెచ్‌ఎస్, 4యూపీఎస్, 27 పీఎస్‌లు ఉండగా వాటిలో 6248 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వాటిలో కొన్ని పాఠశాలలను నూతనంగా లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించినా, వాటికి ప్రహరీలు నిర్మించకపోవడంతో విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలుగుతోంది. నాగర్‌దొడ్డి, నీలిపల్లి, ఎద్దులగూడెం, దాసరపల్లి, బిజ్వారం, చిప్పదొడ్డి, విఠలాపురం, గ్రామాల్లోని పాఠశాలలతో పాటు మల్దకల్ కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వర్షాకాలంలో వర్షపునీరు పాఠశాల ఆవరణలోకి చేరడంతో పాఠశాల ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా తయారవుతోంది. ప్రహరీలు ఉన్న మరికొన్ని పాఠశాలలు గేట్లు లేకపోవడంతో వాటి పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. కస్తూర్బా బాలికల పాఠశాలతో పాటు ఎద్దులగూడెం, బిజ్వారం పాఠశాలల ఆవరణ ముందు ప్రధాన రహదారులు ఉండటం వల్ల విద్యార్థులు ఎప్పుడు రహదారులపైకి వెళ్లి ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీలు లేని పాఠశాలలకు, గేట్లు లేని పాఠశాలలకు వెంటనే నిర్మించాలని కోరుతున్నారు.

ప్రహరీ నిర్మించాలి



మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు, గొర్రెలు, పందులు సంచరిస్తున్నాయి. ప్రహరీ నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– రామలింగం, మల్దకల్

ఇబ్బందులు పడుతున్నారు..



నాగర్‌దొడ్డిలో ప్రభుత్వం కొత్తగా నిర్మించిన పాఠశాల భవనానికి ప్రహరీ నిర్మించకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలు వెచ్చించి పాఠశాల భవనం నిర్మించినా అధికారులు ప్రహరీ నిర్మించడంపై దృష్టి సారించడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని ప్రహరీ నిర్మించాలి.

– సోమన్న, నాగర్‌దొడ్డి

సమస్యలు పరిష్కరించాలి



పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారి ఉండటంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటంతో విద్యార్థులు బహిరంగ ప్రదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

– ఈదన్న, మల్దకల్

చర్యలు తీసుకుంటాం..



మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేని విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. నిధులు మంజూరైన వెంటనే ప్రహరీలు నిర్మించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సురేష్, ఇన్‌చార్జి ఎంఈఓ, మల్దకల్

వలంటీర్ల సేవలు అభినందనీయం

ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు



మల్దకల్‌లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు

మల్దకల్: మల్దకల్ జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎన్‌ఎస్‌ఎస్, ఎస్‌వీఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయమని ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆదిశిలా క్షేత్రంలో జాతర ముగింపు బ్రహ్మోత్సవాల్లో భాగంగా వలంటీర్లకు శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్, ఎస్‌వీఎస్ వలంటీర్లు సేవలు నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. నాలుగు రోజుల పాటు ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు రామాంజనేయులు గౌడ్, నర్సింహులు, ఎస్‌వీఎస్ సంస్థ నిర్వాహకులు అభిలాష్, అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, నాగరాజు శర్మ, చంద్రశేఖర్ రావు, బాబురావు, అరవిందరావు, ముకుందరావు, వాల్మీకీ పూజారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



కేజీబీవీని తనిఖీ చేసిన తహసీల్దార్ సాహెదాబేగం

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు అర్థమయ్యేలా రీతితో పాఠాలు బోధించి వారి విద్యాభివృద్ధి ఉపాధ్యాయులు కృషి చేయాలని తహసీల్దార్ సాహెదాబేగం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, తూర్పుతండా పాఠశాలలను ఎంఈఓ వెంకటేశ్వర్ రావుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఎలా తయారు చేస్తున్నారని వంట ఏజెన్సీలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కొత్త మోనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

కక్షిదారులకు అందుబాటులో ఉండాలి



గద్వాల బార్ అసోసియేషన్ సభ్యులకు మద్దతు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాల క్రైం: జిల్లా కోర్టు సముదాయాలకు కేటాయించిన నూతన భవన సముదాయాలను పూడూర్ హ్యాండ్లూం పార్కు శివారులో ఏర్పాటు విషయంలో గద్వాల బార్ అసోసియేషన్ సభ్యులు వ్యక్తం చేస్తున్న నిరసన సరైందని గద్వాల బీఆర్‌ఎస్ నాయకులు విజయ్‌కుమార్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బాసు హనుమంతులు అన్నారు. మంగళవారం బార్ అసోషియేషన్ సభ్యులు రాఘురామిరెడ్డి, ఖాజామైనొద్దీన్‌లను కలిసి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కోర్టు సముదాయాలు అందరికి అందుబాటులో ఉండాలన్నారు. బాధితులు, కక్షిదారులకు జిల్లా కేంద్రంలో ఉన్న కోర్టు సముదాయాలను అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నూతన భవనాల కోసం పూడూరు గ్రామ శివారులోని హ్యాండ్లూం పార్కు సమీపంలో ఇవ్వడం శోచనీయమన్నారు. కేసుల విషయంలో వచ్చే బాధితులు, కక్షిదారులు తీవ్ర సమస్యలు ఎదుర్కోవల్సిన దుస్థితి ఉందన్నారు. జిల్లా అధికారులు తక్షణమే స్పదించి సముచిత న్యాయం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ సభ్యులు గత వారం రోజుల నుంచి విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. వారికి బీఆర్‌ఎస్ పూర్తి మద్దతుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి



ధరూరులో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కేటీదొడ్డిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



అయిజలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

సాక్షి,నెట్‌వర్క్: లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బాసు హనుమంతు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గద్వాల పట్టణంలోని అంబేడ్కర్‌చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. అనంతరం రాష్ట్రంలో రైతులపై జరుగుతున్న అరాచకాలతో పాటు, లగచర్ల రైతులను కాపాడాలని, ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్ర భుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తోందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నా యకులు మోనేష్, మఖ్బుల్, ప్రతాప్‌రెడ్డి, బీచుపల్లి, నర్సింహులు, రమేష్, రాము, రవిలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

- కేటీదొడ్డి మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవి, కిష్టప్ప, నర్సింహులు, గొవిందు ఉన్నారు.

రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సిగ్గు చేటు

- రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సిగ్గు చేటని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లో నిర్బంధించినందుకు నిరసనగా అయిజ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యులు జమాలుద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేష్, బిందాస్, నాగేంద్ర, బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మత్తాలి, టౌన్ అధ్యక్షుడు మాల వీరేష్, మాజీ అధ్యక్షుడు కురువ వీరేష్, ఉపాధ్యక్షుడు మైబు, రాజు, రంగన్న, మహేష్ పాల్గొన్నారు.
- లగచర్ల రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ మండల నాయకులు ధరూరులో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, మోహన్, రవి, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.
- గట్టులో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బల్గెర హనుమంతునాయుడు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అంగడి బస్వరాజు, మోనేష్, జయసింహారెడ్డి, నూర్‌పాష, వెంకటేష్, రామునా యుడు, కొళాయి భాస్కర్, వీరేష్, తిమ్మప్ప, నర్సింహులు, గోపాల్, సామేలు, రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో బీఆర్‌ఎస్ నేతల పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కుర్వ విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ప్రతాప్, బీచుపల్లి, సుధాకర్, వెంకట్రాములు,శ్రీకాంత్, రాములు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపరాదు

మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడుపరాదని ఎస్‌ఐ చంద్రకాంత్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలను మైనర్లకు ఇవ్వరాదని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి జరిమానా విధించామన్నారు. రోడ్ల ప్రయాణించేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. తనిఖీలో పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉప్పేరులో విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భరోసా టీం సభ్యులు

ధరూరు: మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మహిళా భద్రత విభాగం తెలంగాణ ఆధ్వర్యంలో భరోసా టీం సభ్యులు శిరీష, కవితల లు పలు అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రధానంగా లైంగిక వేధింపులు, ఆత్మ రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. పాఠశాల, కళాశాల ప్రాంగణాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆత్మరక్షణ కోసం బాలికలు కరాటే వంటి వాటిని నేర్చుకోవాలన్నారు. వ్యక్తిత్వ వికాసం కోసం భరోసా కేంద్రం అండగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గౌరీశంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'బస్సుజాతా'ను జయప్రదం చేయండి

అమరచింత: వనపర్తిలో ఈనెల 23న జరిగే ఆశా వర్కర్ల బస్సుజాతాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్.రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆశా కార్యకర్తలతో కలిసి బస్సుజాతాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం నెలకు రూ.18 వేలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వారాంతపు సెలవులు, క్యాజువల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాంతమ్మ, సంధ్య, సుజాత, రాజేశ్వరి,శ్యామల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై విచారణ



ప్రధానోపాధ్యాయుని గురించి విద్యార్థులతో వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ నరసింహ

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్యపై వడ్డేపల్లి ఎంఈఓ నరసింహ మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన విద్యార్థి తండ్రి రంగస్వామి నెల రోజుల క్రితం హెడ్‌మాస్టర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయుడి గురించి వివరాలు సేకరించేందుకు ఎంఈఓ గ్రామానికి వెళ్లారు. విద్యార్థుల తల్లిదండ్రులు పనులకు వెళ్లడంతో విద్యార్థులను కలిసి ఉపాధ్యాయుడి గురించి వివరాలు సేకరించినట్లు ఎంఈఓ తెలిపారు. తల్లిదండ్రులతో పూర్తి వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్‌ఎంను ఎమ్మార్సీకి అటాచ్ చేసి, గతంలో వెంకట్రామనగర్ పాఠశాలకు కేటాయించి విద్యార్థులు తక్కువగా ఉన్నందున పని సర్దుబాటు కోసం జూలెకల్‌కు పంపిన ఉపాధ్యాయురాలు రూపారాణిని పాఠాలు బోధించేందుకు నియమించినట్లు ఎంఈఓ వివరించారు.

ఆశాజనకంగా యాసంగి సాగు

- సస్యరక్షణ చర్యలపై అవగాహన కరువు
- వీసీలకే పరిమితమవుతున్న అధికారులు
- కూలీల కొరత.. పంటలపై ప్రభావం



ఉండవెల్లిలో పప్పు శనగ

ఉండవెల్లి: ఈ ఏడాది అధికంగా వర్షాలు కురిసినా, ఖరీఫ్‌లో పంటలకు ఆశించినంత దిగుబడి రాలేదు. పత్తి, మొక్కజొన్న పంటలు మాత్రమే దిగుబడి వచ్చాయి. కొందరు రైతులకు పెట్టుబడి సైతం రాకపోవడంతో ఆందోళనలో ఉన్నారు. అప్పులు చేసి మళ్లీ యాసంగి సాగుపై దృష్టి సారించారు.

అధికంగా మొక్కజొన్న, పప్పు శనగ సాగు..

ఇప్పటి వరకు వందల ఎకరాల్లో మొక్కజొన్న, పప్పు శనగ పంటలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కృష్ణనది ఒడ్డున ఉన్న ముంపు పొలాల్లో వందల ఎకరాల్లో పప్పు శనగ సాగు చేశారు. చుట్టు పక్కల పొలాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఈ సారి యాసంగి కంటే అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశారు.

అవగాహన కల్పించాలంటున్న రైతులు..

వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తే దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. మిర్చి సాగులో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించేవారు లేక దిగుబడి తగ్గి నష్టపోతున్నారు. కొన్ని మండలాలకు వ్యవసాయాధికారులు లేరు. మండలంలోని మారమునగాల–1,2, ప్రాగటూరు, శేరుపల్లె గ్రామ శివారుల్లో పప్పుశనగ సాగు చేశారు. ఆ పంటల వైపు అధికారులు వెళ్లకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని క్లస్టర్లలో ఏఈఓలు ఉన్నప్పటికీ అవగాహన కల్పించడం లేదు. మంగళవారం వీసీలకు హాజరై చేతులు దులుపేసుకుంటున్నారు. మిగితా వారంలో అన్ని రైతు వేదికలకు తాళాలు ఉంటున్నాయి. అధికారులు స్పందించి వ్యవసాయశాఖలో పూర్తి స్థాయిలో అధికారులను నియమించి యాసంగి పంటల సాగుపై అవగాహన కల్పించాలని కోరతున్నారు.

కూలీల కొరత వల్ల ఇబ్బందులు..

ప్రతి రైతు కూలీలలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మొక్కజొన్నలో కలుపు తీతకు కూలీలు రావడం లేదు. పొగాకు పనులకు మాత్రమే రూ.600 వెళ్తున్నారు. గ్రామంలో అన్ని వ్యవసాయ పనులకు కూలీలే అవసరం.



పొగాకు పంటలో పనిచేస్తున్న కూలీలు

ఆశాజనకంగా పంటలు..



ఈసారి అధిక వర్షాలు కారణంగా భూమిలో తేమ ఎక్కువ ఉంది. ఇప్పటికే వేసుకున్న శనగ పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తే మరింత దిగుబడి సాధిస్తాం.

– మధు, రైతు, ఉండవెల్లి

ఆన్‌లైన్‌లో ఆప్షన్ రాలేదు..



రైతులు యాసంగిలో సాగు చేసిన శనగ, మొక్కజొన్న, పంటలను ఏఈఓలు పరిశీలించి జాగ్రత్తలను రైతులకు వివరించేలా చర్యలు తీసుకుంటాం. ఏఈఓలను ఫీల్డ్‌కు పంపిస్తాం. ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఆప్షన్ రాలేదు. పంటలను పరిశీలించేలా చూస్తాం.

– అనిత, ఏఓ, ఉండవెల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది



కోదండాపురంలో నియామక పత్రాలు అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

మానవపాడు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మీద ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని, ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో 19మంది పోలింగ్ అధ్యక్షులకు నియామకం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 22న మండలస్థాయి కమిటీల ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యాయులు రాజశేఖర్‌శర్మ, లక్ష్మీనారాయణ, రాఘవయ్య, శేఖర్, కుర్మయ్య, యోగిశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా నెరవేర్చలేదని, ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని కోదండాపురం, ఉదండాపురం గ్రామాల్లో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై 32 మంది పోలింగ్ బూత్ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకొని వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు జగదీష్‌రెడ్డి, అబ్దుల్లా, కేకే రెడ్డి, రాజశేఖర్‌శర్మ, పరశురాం, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మారెడ్డి, నాగముని, బీసిరెడ్డి, రాజాగౌడ్ ఉన్నారు.